
హౌసింగ్ బోర్డులోని కేంద్రీయ విద్యాలయం ఎదురు...


కొత్తపట్నం రోడ్డులోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద...


కొప్పోలు రోడ్డు...


టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఎదురు...


గద్దలగుంటలో...

నగరానికి నరకం..!

ఒంగోలు నగరంలోని రహదారులన్నీ దారుణంగా మారిపోయాయి. వర్షాలకు గోతులమయమై ప్రజలకు నరకం చూపిస్తున్నాయి. అడుగడుగునా గుంతలు పడిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అవినీతి అక్రమాలు, దందాలపై మినహా అభివృద్ధి గురించి పట్టించుకోలేదనడానికి ఈ రోడ్లన్నీ నిదర్శనంగా నిలుస్తున్నాయి. రోడ్లపై ఏర్పడిన గోతుల్లో వర్షం నీరు నిలిచి వాటి లోతును అంచనా వేయలేక ప్రజలు ప్రమాదాలకు సైతం గురవుతున్నారు. ఇది జిల్లా కేంద్రమా.. లేకుంటే మారుమూల ప్రాంతమా..? అనుకుంటూ ముక్కున వేలేసుకుంటున్నారు. స్థానిక ఎమ్మెల్యే, నగరపాలక సంస్థ పాలకులు, అధికారుల పనితీరును అసహ్యించుకుంటున్నారు. ప్రధానంగా నగరంలోని కొప్పోలు రోడ్డు, ఏబీఎం కాలేజీ రోడ్డు, మంగమ్మ కాలేజీ బైపాస్ జంక్షన్, సౌత్ బైపాస్ జంక్షన్, కర్నూలు రోడ్డు, గద్దలగుంట, మామిడిపాలెం, హౌసింగ్‌బోర్డుకాలనీ, భాగ్యనగర్ తదితర ప్రాంతాల్లోని రోడ్లు మరీ అధ్వానంగా ఉన్నాయి. ఆయా రోడ్లపై వాహనచోదకులు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. రాత్రివేళల్లో గుంతలను గుర్తించే అవకాశం లేకపోవడంతో ప్రమాదాలు జరిగి గాయపడుతున్నారు. రోడ్ల గురించి పట్టించుకోని పాలకులు, అధికారుల నిర్లక్ష్యంపై మండిపడుతున్నారు.

- సాక్షి, ఒంగోలు


భాగ్యనగర్ 4వ లైన్‌లో పలు చోట్ల...


సౌత్‌బైపాస్ జంక్షన్‌లో...




భాగ్యనగర్ 4వ లైన్‌లోని కేఎంఎస్ స్కూల్ వద్ద...


మంగమ్మకాలేజీ బైపాస్ జంక్షన్‌లో సర్వీస్ రోడ్డు...


కమ్మపాలెంలో...


ఏబీఎం కాలేజీ వద్ద...

క్లుప్తంగా

జిల్లా న్యాయస్థానం ఆవరణలో క్లీన్ అండ్ గ్రీన్


న్యాయస్థానం ఆవరణను శుభ్రం చేస్తున్న న్యాయస్థానాల అధికారులు, సిబ్బంది

ఒంగోలు: జిల్లా న్యాయస్థానం ఆవరణలో శనివారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా న్యాయస్థానం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. న్యాయస్థానాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచేందుకు క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం చేపట్టాలని హైకోర్టు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. 8వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి అమ్మన్నరాజా, 7వ అదనపు జిల్లా న్యాయమూర్తి రాజావెంకటాద్రితో పాటు పలువురు న్యాయమూర్తులు పర్యవేక్షించారు. ఆవరణలో ఉన్న చెత్తాచెదారం తొలగించడంతో పాటు ఆవరణలో ఉన్న పార్కులోని పిచ్చిమొక్కలు పీకేసి ఆహ్లాదకర వాతావరణం నెలకొల్పారు. ప్రకాశం జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు చాకిరి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

సింగరాయకొండలో అత్యధిక వర్షపాతం

- 86.2 మిల్లీమీటర్లు నమోదు

ఒంగోలు అర్బన్: జిల్లాలో శనివారం సింగరాయకొండ మండలంలో అత్యధికంగా 86.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. జరుగుమల్లి 65.6 మిల్లీమీటర్లు, కొనకనమిట్ల 56.6, కొత్తపట్నం 34.4, గిద్దలూరు 34.2, టంగుటూరు 29.9, కురిచేడు 29.4, బేస్తవారిపేట, మార్కాపురం 29, సంతనూతలపాడు 27.8, ఒంగోలు 24.4, వెలిగండ్ల 22.2, పామూరు 21.8, పొదిలి 21.6, కొమరోలు 19.2, కంభం 16.8, నాగులుప్పలపాడు 16.2, మద్రిపాడు, పుల్లలచెరువు 15.8, పొన్నలూరు, పెద్దారవీడు 14.2, మద్దిపాడు 13.4, దొనకొండ, తర్లుపాడు 13, సీఎస్ పురం 12.8, పీసీ పల్లి 11.2, చీమకుర్తి 10.4, తాళ్లూరు, దోర్నాల 9.6, అర్ధవీడు 9.4, త్రిపురాంతకం 8.8, కొండపి 7.6, హెచ్‌ఎం పాడు, యర్రగొండపాలెం 7.4, దర్శి 6, కనిగిరి 2.8, ముండ్లమూరు 1.8, రాచర్ల 1 మిల్లీమీటరు వర్షపాతం నమోదయింది.

ఆరు గ్రానైట్ కంటైనర్లు పట్టివేత

ఒంగోలు సిటీ: గెలాక్సీ గ్రానైట్ శ్లాబ్స్‌ను చెన్నై పోర్టుకు అక్రమంగా తరలిస్తున్న ఆరు కంటైనర్లను శనివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో పట్టుకున్నట్లు మైనింగ్ డీడీ రాజశేఖర్ తెలిపారు. కంటైనర్లను తనిఖీ చేయగా గ్రానైట్ ఫ్యాక్టరీల నుంచి ఎటువంటి అనుమతి పత్రాలు లేవని తేలిందన్నారు. దీంతో ఆరు కంటైనర్లను ఒంగోలు తాలూకా పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు. మైనింగ్ డీడీ రాజశేఖర్ ఆధ్వర్యంలో అసిస్టెంట్ జియాలజిస్ట్ రవివర్మ, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ అరవింద్ చౌదరి, టెక్నికల్ అసిస్టెంట్లు శీలం సురేష్‌బాబు, రాజీనాయుడు ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. అదే విధంగా గనులశాఖ విజిలెన్స్ విభాగం వారు హైదరాబాద్‌కు అక్రమంగా గ్రానైట్ శ్లాబ్స్ తరలిస్తున్న రెండు లారీలను కనిగిరి వద్ద సీజ్ చేసి కంభం పోలీసుస్టేషన్‌కు తరలించారు. గ్రానైట్ శ్లాబ్స్‌గానీ, గ్రానైట్ బ్లాక్స్‌గానీ అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీడీ రాజశేఖర్ హెచ్చరించారు.

డైస్లెక్సియా అనేది అభ్యాస రుగ్మత


డైస్లెక్సియాపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది

ఒంగోలు సిటీ: డైస్లెక్సియా అనేది ఒక అభ్యాస రుగ్మత అని సమగ్రశిక్ష సహితవిద్య జిల్లా సమన్వయకర్త ఎం.రమేష్ అన్నారు. శనివారం స్థానిక గద్దలగుంటలోని ఎస్.పి.కె.ఆర్.ఎస్.ఎ.వి.ఎస్ ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో డైస్లెక్సియాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ప్రసంగ శబ్దాలను గుర్తించడం, అక్షరాలు, పదాలకు (డీకోడింగ్) ఎలా సంబంధం కలిగి ఉందో తెలుసుకోవడానికి సమస్య కారణంగా చదవటంలో ఇబ్బంది ఉంటుందని, దానినే డైస్లెక్సియా అంటామని వివరించారు. ఒంగోలు ఎంఈఓ-2 సరస్వతి మాట్లాడుతూ సమగ్ర శిక్ష ద్వారా విభిన్న వైకల్యం కలిగిన పిల్లలను ప్రశస్త్ యాప్‌తో పాఠశాల స్థాయిలో గుర్తించడం జరుగుతోందన్నారు. హెచ్‌ఎం పద్మావతి మాట్లాడుతూ అభ్యాస వైకల్యం ఏడు రకాలుగా ఉంటుందన్నారు. అందులో ముఖ్యంగా డైస్లెక్సియా, డైస్‌గ్రాఫియా, డైస్కాల్క్యులియా, ఆడిటరీ ప్రాసెసింగ్ డిజార్డర్ అనేవి చాలా మంది పిల్లలకు ఉంటాయని వివరించారు. దీనిని సరైన శిక్షణతో అధిగమించవచ్చని తెలిపారు. ముందుగా డైస్లెక్సియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సహితవిద్య ఉపాధ్యాయులు మాలిక్ మొహిద్దీన్, నాగేంద్రమ్మ, సురేష్, ఆనంద్, రవికుమార్, సృజన, వీరబ్రహ్మం, చంద్రశేఖర్, సంధ్య, శ్రావణి, సీఆర్పీ శ్యామ్, జ్యోతి, కల్పన, ఏడుకొండలు, సునీత, పద్మరాజా, పిచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామికి అభిషేకాలు

ఒంగోలు మెట్రో: నగరంలో పలు వైష్ణవాలయాల్లో శనివారం అఖిలాండ బ్రహ్మాండ నాయకుడు కలియుగ వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలను వైభవంగా నిర్వహించారు. రంగారాయుడు చెరువు వద్ద గల శ్రీదేవి, భూదేవి సమేత కళ్యాణ వెంకటేశ్వరస్వామికి, సమతా నగర్లోని వెంకటేశ్వరస్వామికి, బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్‌లోని వెంకటేశ్వరస్వామికి ఆలయ అర్చకులు నిర్వహించిన అభిషేకాలు నయనానందకరంగా సాగాయి. గర్భాలయంలో స్వామి, అమ్మవార్ల మూలవిరాట్లకు ఆలయ అర్చకులు పంచామృతాలు, విశేష ద్రవ్యాలతో శాస్త్రోక్తంగా అభిషేకం చేశారు. అనంతరం స్వామివారిని చూడచక్కగా పుష్పాలతో అలంకరించి ప్రత్యేక హారతులతో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి ఏడుకొండలస్వామి ఆశీసులు అందుకున్నారు.


పుష్పాలంకరణలో వెంకటేశ్వరస్వామి

జనావాసాల మధ్య మద్యం షాపు వద్దే వద్దు


మద్యం షాపు వద్దంటూ డిప్యూటీ తహసీల్దార్ కు వినతి పత్రం ఇస్తున్న స్థానికులు

సంతనూతలపాడు: జనావాసాల మధ్య మద్యం షాపు పెట్టవద్దంటూ స్థానిక పెద్ద బజారులోని పిచ్చయ్య హోటల్ సమీపంలోని స్థానికులు డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. హోటల్ సమీపంలో మద్యం దుకాణం ఏర్పాటు చేసేందుకు శనివారం ఏర్పాట్లు చేస్తుండగా స్థానిక మహిళలు మద్యం షాపు వద్దంటూ నిరసన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో మసీదు, కోదండ రామస్వామి ఆలయం, సాయిబాబా సత్సంగ కేంద్రం, నాగర్పమ్మ ఆలయం, గ్రంథాలయం, పిల్లలు చదువునే ట్యూషన్ సెంటర్లు ఉన్నాయి. నిత్యం రద్దీగా ఉండే మద్దులూరు మెయిన్ రోడ్ లో ఈ మద్యం షాపు వలన వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని డిప్యూటీ తహసీల్దార్ ఎస్ మాబు సుభానిని కలిసి మద్యం షాపు వద్దని వినతి పత్రం అందజేశారు.

రేపటి నుంచి వేటపాలెంలో అంతర కళాశాలల ఆటల పోటీలు

ఒంగోలు: ఈనెల 21 నుంచి వేటపాలెంలో అంతర కళాశాలల ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం ఫిజికల్ ఎడ్యుకేషన్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఐ.దేవీ వరప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. యూనివర్శిటీ పరిధిలోని 224 కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులకు బ్యాడ్మింటన్ మెన్, షటిల్ మెన్, సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తారన్నారు. ఈ పోటీలు వేటపాలెంలోని బండ్ల బాపయ్య హిందూ డిగ్రీ కాలేజీ ఆడిటోరియంలో జరుగుతాయన్నారు. ఆంధ్రకేసరి యూనివర్శిటీ ఏర్పడిన తరువాత తొలిసారిగా ఈ పోటీలను వేటపాలెంలో నిర్వహిస్తున్నామన్నారు. పోటీల్లో ఎంపికై న జట్లు చెన్నైలోని ఎస్‌ఆర్‌ఎం యూనివర్శిటీలో జరిగే అంతర విశ్వవిద్యాలయాల పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుంది. టీము ఎంపిక బాధ్యతను ఉలవపాడు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఫిజికల్ డరెక్టర్ గంటా సాయి సురేష్ నిర్వహిస్తారు. యూనివర్శిటీ పరిధిలోని అన్ని కాలేజీల యాజమాన్యాలు, ప్రిన్సిపాళ్లు, ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొని పోటీలను విజయవంతం చేసేందుకు సహకరించాలని ఫిజికల్ ఎడ్యుకేషన్ డిప్యూటీ డైరెక్టర్ ఐ.దేవీ వరప్రసాద్ కోరారు.

విజయవాడ వరద బాధితులకు సహాయం

ఒంగోలు మెట్రో: అఖిల ప్రజా కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితుల సహాయార్థం సేకరించిన సహాయనిధిని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఆధ్వర్యంలో మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో సీఎం చంద్రబాబుకు అందించారు. విజయవాడ వరద బాధితుల సహాయార్థం గత నెలలో నిర్వహించిన కళా ప్రదర్శనలకు దాతలు అందించిన రెండు లక్షల రూపాయలు, పద్మశ్రీ ఎడ్ల గోపాలరావు అందించిన రూ.2 లక్షలు కలిపి మొత్తం రూ.4 లక్షలను సీఎంకు అందించారు. అదే సమయంలో రాష్ట్రంలోని కళాకారులు పడుతున్న కష్టాల గురించి, వారికి అందాల్సిన బెనిఫిట్స్ గురించి సీఎం దృష్టికి తీసుకెళ్లారు. చింతామణి నాటకాన్ని ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని సీఎంకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో అఖిల ప్రజా కళాకారుల సంక్షేమ సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు గంట మంగాదేవి, ఉపాధ్యక్షురాలు బోను దుర్గ, అధ్యక్షుడు ద్వారపురెడ్డి ధనుంజయరావు, కార్యదర్శి రౌతు వాసుదేవ్, మువ్వల వెంకటరమణ, బొంగు భాస్కర్, మిమిక్రీ శివ, గంటా సూర్యనారాయణ, ఎడ్ల గోపాలరావు, జిల్లా రంగభూమి కళాకారుల సంఘ ప్రధాన కార్యదర్శి అంగలకుర్తి ప్రసాద్, గాయనీమణులు ఏల్చూరి అనంత లక్ష్మి, తాళ్లూరు శ్రీదేవి, చల్లా నాగేశ్వరమ్మ, దేనువకొండ సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపడి పాడైన విద్యుత్ పరికరాలు

సంతనూతలపాడు: మండలంలోని మన్నం వారిపాలెం గ్రామంలో శనివారం మధ్యాహ్నం భారీ ఈదురుగాలులు వీచి పిడుగుపడింది. కామేపల్లి సురేష్ గృహ సమీపంలో పిడుగు పడి చుట్టుపక్కల 10 గృహాల్లో టీవీలు, హీటర్లు, ఇతర విద్యుత్ పరికరాలు దెబ్బతిన్నాయి. లక్షల రూపాయల్లో ఆస్తి నష్టం వాటిల్లిందని స్థానికులు తెలిపారు.

ప్రిన్సిపాల్, పీఈటీ, సీఆర్టీలకు సర్టిఫికెట్ వెరిఫికేషన్


సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేస్తున్న అధికారులు

ఒంగోలు సిటీ: ఒంగోలు సమగ్రశిక్ష కార్యాలయంలో ప్రిన్సిపాల్, పీఈటీ, సీఆర్టీ లకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించినట్లు ఇన్‌చార్జ్ డీఈఓ సుబ్బారావు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 42 పోస్టులకు సంబంధించి 1331 మంది దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. అందులో 112 మంది అభ్యర్థులను వెరిఫికేషన్‌కు పిలిచినట్లు తెలిపారు. అందులో 88 మంది హాజరుకాగా, 24 మంది గైర్హాజరయ్యారన్నారు. ఆదివారం ఉదయం 10 గంటలకు పీజీటీలకు, అకౌంటెంట్లు, వార్డన్లకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

- ప్రతిఒక్కరికీ ఆరోగ్యకరమైన ఆహారం అందించడమే లక్ష్యం
- ఏపీసీఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సుభాషిణి


ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రంలో ప్రాజెక్టు జిల్లా మేనేజర్ సుభాషిణి, నిర్వాహకులు

ఒంగోలు సబర్బన్: ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని, దాని ద్వారా ప్రతిఒక్కరికీ ఆరోగ్యకరమైన ఆహారం అందించడమే లక్ష్యమని రైతు సాధికార సంస్థ ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ (ఏపీసీఎన్ఎఫ్) జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వి.సుభాషిణి అన్నారు. ఒంగోలు మండలంలోని ఉలిచి గ్రామంలో రైతు సాధికార సంస్థ ఏపీసీఎన్ఎఫ్ ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో మన్మధ ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ కేంద్రం ద్వారా అన్ని రకాల పంటలకు ఉపయోగపడే కషాయాలు, గ్రోత్ ప్రమోటార్స్, పసుపు అట్టలు, లింగాకర్షక బుట్టలు, నవధాన్య విత్తనాలు, కిచెన్ గార్డెన్ విత్తనాలు అందుబాటులో ఉంటాయని వివరించారు. రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఎటువంటి రసాయనాలు వాడకుండా ప్రకృతి ద్వారా లభించే ఆకులు, ఆవు పేడ, ఆవు మూత్రం ద్వారా కషాయాన్ని తయారు చేసుకోవచ్చని తెలిపారు. ప్రకృతి సేద్యం చేయడం ద్వారా తక్కువ ఖర్చుతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. పూర్తిగా సహజసిద్ధంగా పంటలు పండించవచ్చని ఆమె పేర్కొన్నారు. రాబోయే రబీ సీజన్లో శనగ, వరి, మినుము, అన్ని రకాల పంటలకు ఉపయోగపడే కషాయాలు, గ్రోత్ ప్రమోటర్స్‌ను రైతులంతా వినియోగించుకోవాలని, ఖర్చులు తగ్గించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జ్ రాధా శింగమనేని, కేంద్రం నిర్వాహకురాలు మన్మధ, మహిళా సంఘ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

వాహనాలకు పెండింగ్ ఈ చలానాలు తక్షణమే చెల్లించాలి


వాహనాలను తనిఖీ చేస్తున్న సంతనూతలపాడు ఎస్సై అజయ్‌బాబు

సంతనూతలపాడు: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సెంటర్లో శనివారం ఎస్సై అజయ్‌బాబు ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేశారు. వాహనదారులు తప్పనిసరిగా తమ వాహనాలకు సంబంధించిన ఈ చలానాలను పెండింగ్ లేకుండా తక్షణమే చెల్లించాలని కోరారు. లేనిపక్షంలో వాహనాలను సీజ్ చేస్తామని ఎస్సై హెచ్చరించారు. ప్రతిఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రమాదాల నుంచి రక్షణ పొందాలని కోరారు. వాహనాలు నడిపేటప్పుడు మద్యం సేవించరాదని, చలానాలు పెండింగ్ ఉంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వీసీని కలిసిన ప్రొఫెసర్ నాగేశ్వరరావు


ఏకేయూ వీసీ మూర్తికి బొకే ఇచ్చి అభినందనలు తెలుపుతున్న ప్రొఫెసర్ నాగేశ్వరరావు

ఒంగోలు సిటీ: స్థానిక ఆంధ్రకేసరి యూనివర్సిటీ వైస్ చాన్సిలర్ ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తిని ఆంధ్రా యూనివర్సిటీ పూర్వపు ఉపకులపతి ప్రొఫెసర్ జి.నాగేశ్వరరావు శనివారం ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం బొకే ఇచ్చి అభినందనలు తెలిపారు. ప్రస్తుత విద్యావిధానంలో చోటుచేసుకుంటున్న మార్పులు, చేర్పుల గురించి చర్చించారు. ఆంధ్రకేసరి విద్యాకేంద్రం విద్యాసంస్థల చైర్మన్ ఎం.నాగేశ్వరరావు, ఆంధ్రకేసరి యూనివర్సిటీ వైస్ చాన్సిలర్ ప్రొఫెసర్ మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబుతో పలు అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పి.చెంచురామయ్య, పాలకమండలి సభ్యుడు కె.మస్తాన్, ప్రిన్సిపాల్ కే వెంకటేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకత వెలికితీసేందుకే నో బ్యాగ్ డే


నో బ్యాగ్ డే కార్యక్రమంలో డ్రాయింగ్ వేసిన విద్యార్థులతో గణిత ఉపాధ్యాయుడు

కొత్తపట్నం: విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీసేందుకే నో బ్యాగ్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు స్థానిక బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు సీహెచ్ కోటేశ్వరరావు తెలిపారు. పాఠశాలలో శనివారం నో బ్యాగ్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి నెలలో మూడో శనివారం ప్రైమరీ విద్యార్థులకు నో బ్యాగ్ డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రంగురంగుల కాగితాలతో కొన్ని ఆకారాలను కత్తిరించి విద్యార్థులకు చూపిస్తూ కొన్ని ప్రశ్నల ద్వారా జవాబులను కోటేశ్వరరావు రాబట్టారు. విద్యార్థులు ఎంతో ఆసక్తికరంగా ఉల్లాసంగా గడిపి సంతోషం వ్యక్తం చేశారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో భయాన్ని పోగొట్టి సోషల్ మూమెంట్‌ను కలిగించవచ్చని గణిత ఉపాధ్యాయుడు తెలిపారు. ప్రశ్నలకు జవాబులు చెప్పించి విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించవచ్చన్నారు. విద్యార్థులకు అభినయగేయాలు, పద్యాలు, కథలు, బొమ్మల ద్వారా నీతిని బోధించారు.